క్లుప్తంగా

ఆముదంలో పంటకోత ప్రయోగాలు



రాఘవంపల్లి వద్ద పంటకోత ప్రయోగాలను పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఆముదం పంటలో దిగుబడి అంచనా నిమిత్తం పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. గురువారం మండలంలోని రాఘవంపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 18–4లో కూనమినేని శ్రీనివాసులు పొలంలో పంటకోత ప్రయోగాలను ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీ నరసింహశర్మ పర్యవేక్షణలో 10 గీ10 విస్తీర్ణం లో మొదటి ఫీడింగ్‌లో పంటకోత నిర్వహించారు. దిగుబడి 2,160 గ్రాములు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ఓబిరెడ్డి, విహెచ్‌ఏ సత్యనారాయణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

హార్స్ రైడింగ్ స్పోర్ట్స్ అకాడమీ ప్రారంభం



హార్స్ రైడింగ్ అకాడమీ నిర్వాహకులతో ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: బీడుపల్లి సమీపంలో సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఆర్‌జే హార్స్ రైడింగ్ స్పోర్ట్స్ అకాడమీని ఎస్పీ మాధవరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం హార్స్ రైడింగ్ చేశారు. కార్యక్రమంలో స్వామీజీ విద్యా నరసింహ భారతి, ఆర్‌జే స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ నవీన్, సందీప్, యానస్ తదితరులు పాల్గొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంటకు చెందిన నూరుల్లా (45) గురువారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య షమీమ్, ఇద్దరు కుమారులు ఉన్నారు. నూరుల్లా కప్‌బోర్డులు పనిచేస్తూ జీవించేవాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయండి



విద్యార్థినులకు భోజనం వడ్డిస్తున్న డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని డీవీఈఓ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను గురువారం డీవీఈఓ ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలోని పలు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థినులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా వడ్డించారు. కళాశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డికి సూచించారు. ప్రతి విద్యార్థిని ఇష్టంతో చదివితే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అమడగూరు: గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా లభించే చిరుధాన్యాలతో మంచి పౌష్టికాహారం అందుతుందని ఓడిచెరువు మండల ప్రత్యేకాధికారి రమేష్ పేర్కొన్నారు. గురువారం గౌనిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బంది సలహాలను పాటించడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.రాగి, సజ్జ, కొర్ర, సామ, మొలకగింజలు, బెల్లం, కోడి గుడ్లు తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ష్యామీర్‌భాషా, తహసీల్దార్ రామనాథరెడ్డి, ఎంపీడీఓ వరలక్ష్మీ, సర్పంచ్ వెంకటరమణ, వైద్యాధికారులు భానుప్రకాష్ నాయక్, కమల్ పాల్గొన్నారు.

జగన్‌తోనే బంగారు భవిత

- 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలంటే'పై సన్నాహక సమావేశం
- హాజరైన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బంగారు భవిష్యత్తుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ' ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలంటే' కార్యక్రమంపై సన్నాహక సదస్సు నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. మొదట మండలంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలకు ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలంటే కార్యక్రమంపై వీడియో చిత్రాల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత చంద్రబాబు పాలన, ప్రస్తుత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఉన్న తేడా, ప్రజాభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కురుబలను దగా చేసింది పరిటాల కుటుంబమే: తమ స్వార్థ రాజకీయాల కోసం కురుబలను మోసం చేసి దగా చేసింది పరిటాల కుటుంబమేనని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో టీడీపీ నేత చంద్రబాబు రూ. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొడితే, దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు విచారణ చేపట్టి, అందులో చంద్రబాబు పాత్ర ఉందని తెలిసి ఆయన్ను జైలుకు పంపారన్నారు. స్కాంను కప్పిపుచ్చుకునేందుకు కోర్టు తీర్పులను అపహాస్యం చేసేలా ధర్నాలు, దీక్షలు చేయటం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇక పరిటాల సునీత, శ్రీరామ్, అనుచరులు మరింతగా రెచ్చిపోతూ గ్రామాల్లో కుల రాజకీయాలు, వర్గ రాజకీయాలు ఉసిగొలిపేలా ధర్నాలు, ర్యాలీలు చేస్తున్నారన్నారు. కురుబల రాజకీయ భవిష్యత్తు కోసం ఏరోజూ ఆలోచించని వారు ర్యాలీల్లో మాత్రం వారిని వాడుకుంటున్నారన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతా ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు రాప్తాడు నియోజకవర్గంలోని వలువురు కురుబలకు రాజకీయ వదవుల్లో సముచిత స్థానం కల్పించింది తామేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, ఎంపీపీ కంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రామగిరి: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆంధ్రాకు ఎందుకు జగన్ కావాలి అనే కార్యక్రమంపై వలంటీర్లు, పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..నియోజకవర్గంలోని పేరూరు డ్యాంతోపాటు అన్ని చెరువులకు నీరందించినట్లు తెలిపారు. నసనకోట ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతోపాటు త్వరలోనే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో రామగిరి బంగారు గనులు ప్రారంభించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత ప్రజలకు పరిటాల కుటుంబం చేసిందేమీలేదన్నారు. ఆది నుంచి తమ కుటుంబం సొంత డబ్బులతో నియోజకవర్గంలో ఉచితంగా రైతులకు బోర్లు వేస్తున్నట్లు తెలిపారు. రామగిరి మండలంలో 300లకుపైగా రైతులకు బోర్లు వేశామన్నారు. రాబోవు ఎన్నికల్లో రాప్తాడు, పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలో తేల్చుకోలేకపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, జెడ్పీటీసీ నాగార్జున, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ముత్యాలు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, సర్పంచు మీనుగ నాగరాజుతో పాటు నాయకులు నరసింహారెడ్డి, జనార్దన్, వెంకటరెడ్డి, ఓబిరెడ్డి, రామాంజనేయులు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యం

చెన్నేకొత్తపల్లి: సంక్షేమం అభివృద్ధికి తమ ప్రభుత్వం సమ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం చెన్నేకొత్తపల్లిలో 'ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మండల అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు వారు ఉన్న ఊరిలోనే నిర్మించిందన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ మేలును ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీప అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, సర్పంచ్ ధనశ్రీ, వైస్ ఎంపీపీలు రాములమ్మ జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నర్సిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

బాబు హయాంలో అభివృద్ధి శూన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

- అవినీతి చేసి జైలు పాలయ్యారు
- ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి: చంద్రబాబు హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ఆరోపించారు. స్థానిక షాలిమర్ ఫంక్షన్ హాల్‌లో గురువారం కదిరి టౌన్, కదిరి రూరల్ మండలాలకు చెందిన జేసీఎస్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కదిరిటౌన్, రూరల్‌లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. సుమారు రూ.240 కోట్లతో బైపాస్ రోడ్డు, వేమారెడ్డి కూడలి నుంచి రాయలసీమ సర్కిల్ వరకూ రోడ్డు విస్తరణ, అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణం, ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం, ప్రతి చెరువునూ కృష్ణా జలాలతో నింపడం ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు.

అవినీతికి పాల్పడితే జైలే..

చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అవినీతికి పాల్పడి సుమారు నెల రోజులుగా జైల్లో కూర్చున్నారన్నారు. ఇంకా ఎన్నో అవినీతి కేసుల్లో చంద్రబాబు నిందితుడిగా ఉన్నారని తెలిపారు. చంద్రబాబు అవినీతి కేసును వాదిస్తున్న ఆయన తరపు న్యాయవాదులు ఎక్కడా చంద్రబాబు అవినీతికి పాల్పడం లేదని చెప్పలేదని, అరెస్ట్ చేసిన విధానం బాగోలేదని చెప్పడాన్ని బట్టీ ఆయన అవినీతి చేశారని ప్రజలంతా నమ్ముతున్నారని చెప్పారు. ఇంత అవినీతికి పాల్పడిని ఇంకా చంద్రబాబు సచ్చీలుడని ఆ పార్టీ నాయకులతో పాటు ఎల్లో మీడియా ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారన్నారు. ప్రజలు వారికన్నా తెలివైన వారనే విషయం వారు గుర్తుంచుకోవాలన్నారు.

చేసింది చెబుదాం

గృహసారథులు, జేసీఎస్, సచివాలయ పార్టీ కన్వీనర్లు ప్రతి ఒక్కరూ ఈనెల 11 నుంచి రోజుకు గంట చొప్పున పార్టీ కోసం పని చేయాలన్నారు. మళ్లీ జగనన్నే ఎందుకు ముఖ్యమంత్రిని చేసుకోవాలనే దానిపై వివరించాలన్నారు. రోజూ తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి తాము చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు వారు పొందిన లబ్ధిని వివరించాలని సూచించారు. అనంతరం వారి కోరిక మేరకు ఎన్నికలు పూర్తయ్యే వరకూ వారి ఇళ్లపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీలు, మండల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇంటి వద్దకే వైద్య సేవలు



నల్లచెరువు మండలం అల్లుగుండులో వైద్య పరీక్షలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి



అమడగూరు: ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేస్తున్న అధికారులు

కదిరి అర్బన్: పేదల ఇంటి వద్దకే వైద్య సేవలు అందించేందుకు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కాళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. 108, 104 వాహనాలను పునరుద్ధరించి మెరుగైన వైద్యం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, ఎంపీడీఓ అంజనప్ప, మండల కన్వీనర్ ప్రకాష్ పాల్గొన్నారు.

నల్లచెరువు: మండల పరిధిలోని అల్లుగుండులో గురువారం ఎమ్మెల్యే సిద్దారెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. మండలంలోని దామవాండ్లపల్లి నుండి నల్లజోడువారిపల్లి వరకూ రూ.1.87 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును ప్రారంభించారు. దాదాపు130కి పైగా గ్రామాలకు సీఎం జగనన్న ప్రభుత్వంలో రోడ్లను నిర్మించామని తెలిపారు. అనంతరం నడింపల్లి గ్రామంలో ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమంపై జేసీఎస్ కన్వీనర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి,మండల కన్వీనర్ హైదర్‌వలి, ఎంపీడీఓ శకుంతల,స్పెషల్ ఆఫీసర్ సేర్యనారాయణ, పాల్గొన్నారు.

బత్తలపల్లి: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టినట్లు ఎంపీపీ బగ్గిరి త్రివేణి పేర్కొన్నారు. గురువారం మండలంలోని తంబాపురం విలేజ్ హెల్త్ క్లినిక్ వద్ద సర్పంచ్ సానే జయచంద్రారెడ్డి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి మనోహర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సీఎస్‌డీటీ శారద పాల్గొన్నారు.

నల్లమాడ: నల్లమాడ2 సచివాలయం పరిధిలోని పెమనకుంటపల్లి తండా గిరిజన పంచాయతీ కేంద్రంలో గురువారం అధికారులు 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని ఎంపీపీ డుంగావత్ సునీతాబాయి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ మీనాక్షి, ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్రనాయక్ పాల్గొన్నారు.

కొత్తచెరువు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పేదలకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడమే లక్ష్యమని సర్పంచ్ అలివేలమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొడపగానిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా 362 మందికి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ స్వాతి, డాక్టర్ వెంకటనారాయణ రెడ్డి, ఏపీఎం రవీంద్రారెడ్డి, కార్యదర్శి గంగాధర్ రెడ్డి పాల్గొన్నారు.

అమడగూరు: గుండువారిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పంచాయతీలో మంజూరైన ఆయుష్మాన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునెప్ప, తహసీల్దార్ వెంకటరెడ్డి, వైద్యాధికారులు మోనా, అపర్ణ పాల్గొన్నారు.

ఎన్పీకుంట: వెలిచలమల పంచాయతీలో వైద్యాధికారుల ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఎంపీపీ ఈటి రాము సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓఆర్డీ మనోహర్, వైద్యాధికారులు డాక్టర్ ఆసియా, ఆనంద్‌వర్ధన్, యూత్‌కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల పరిధిలోని సోమయాజులపల్లి గ్రామ సచివాలయంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్యశిబిరాన్ని వైద్యాధికారులు మహేశ్వర మారుతి, బాబా ఫకృద్దీన్‌ల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు విద్యాసాగర్, డాక్టర్ అనూరాధ పాల్గొని 310 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారిలో 20 మందిని ఉన్నత చికిత్సలకు రెఫర్ చేశారు.

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం సిద్ధరాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి మండల ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత చెరువుకుంట పరిశీలన



గ్రామస్తులు, రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రకుమార్

ఎన్పీకుంట: మండల పరిధిలోని చీమలచెరువుపల్లిలో ఆక్రమిత ద్వారనాల చెరువుకుంటను గురువారం తహసీల్దార్ నరేంద్రకుమార్ రెవెన్యూ అధికారులతో కలసి పరిశీలించారు. సుమారు మూడు ఎకరాల మేర చెరువుకుంట కబ్జాకు గురవుతోందని గ్రామానికి చెందిన పలువురు రైతులు బుధవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విచారణ చేపట్టిన తహసీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చెరువుకు ఆనుకొని ఉన్న ప్రదేశంలో పెద్దపెద్ద బండలు, మట్టి తోలి ఉండటాన్ని గమనించి సంబంధిత వ్యక్తిని పిలిపించి ఆరా తీశారు. తన పొలాన్ని చదును చేసుకున్న సమయంలో బయల్పడిన రాళ్లను, మట్టిని ఆ ప్రదేశంలో తోలానని తెలపగా వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. అలాగే మరో వైపు చెరువు కుంటకు సంబంధించిన కొంత భూమిలో ఓ రైతు పంట సాగు చేసిన విషయం గుర్తించారు. పంట చేతికి వచ్చిన తరువాత మరో మారు పంట సాగు చేయకూడదని హెచ్చరించారు. గ్రామస్తుల సమక్షంలో ఇరువర్గాల వారిని పిలిపించి సమస్యను పరిష్కరించారు. ద్వారనాల చెరువుకుంటకు సంబంధించి హద్దులను ఏర్పాటు చేసి ఇరిగేషన్ వారికి నివేదిక ఇస్తామని తెలిపారు.

కారు, ఆటో ఢీ: ముగ్గురికి గాయాలు



గాయపడిన మల్లేసు, నాగేంద్రమ్మ, ఆటో డ్రైవర్ రామాంజనేయులు


బత్తలపల్లి: అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండల పరిధిలోని గుమ్మల్లకుంట బస్టాప్ సమీపంలో గురువారం ఆటో, కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముదిగుబ్బ నుంచి అనంతపురం వైపు ఆటో వస్తోంది. ఇదే సమయంలో బత్తలపల్లి నుంచి పత్యాపురానికి మారుతి సుజికి కారు వెళ్తోంది. ఈ రెండు వాహనాలు గుమ్మల్లకుంట వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురం గ్రామానికి చెందిన మల్లేసు, నాగేంద్రమ్మ, ఆటో డ్రైవర్ రామాంజనేయులు (అనంతపురం) తీవ్రంగా గాయపడ్డారు. పత్యాపురం గ్రామానికి చెందిన జయమ్మ, భారతికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మరో నలుగురికి..


నల్లచెరువు: ప్యాయలవాండ్లపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కదిరిలో నివాసం ఉంటున్న మహారాష్ట్రకు చెందిన ఇర్ఫాన్, గోవిందు కుశాల్, బిట్టు కుమార్ అనే యువకులు వివాహ కార్యక్రమానికి సంబంధించి డెకరేషన్ చేయడానికి తనకల్లు మండలం కొక్కంటికి ద్విచక్రవాహనంలో బయలు దేరారు. కదిరికి చెందిన వెంటేష్ నాయుడు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో కదిరికి బయలుదేరాడు. ప్యాయలవాండ్లపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురు తీవ్రగాయాలపాలయ్యారు. స్థానికులు గమనించి గాయపడిన వారిని 108 వాహనంలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్ సొమ్ము స్వాహా

- బరి తెగిస్తున్న టీడీపీ కార్యకర్తలు



గిరక నారాయణమ్మ తీసుకున్న సర్టిఫికెట్



పింఛన్ తీసుకున్న మల్లెల కమలమ్మ

బత్తలపల్లి: మండలంలోని తంబాపురం, వెంకటగారిపల్లి గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు పలువురికి నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి పింఛన్ మంజూరు చేయించారు. ఇలాంటి పింఛన్లు ఇంకా ఉన్నాయని సమాచారం. ఈ విషయమై స్థానిక నాయకులు మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తంబాపురం గ్రామానికి చెందిన గిరక నారాయణమ్మ స్వతహాగా నిలబడి పనులు చేసుకుంటుంది. ఈమెను టీడీపీ నాయకులు సదరం క్యాంపుకు తీసుకువెళ్లి దొంగ సర్టిఫికెట్ ఇప్పించారు. దీంతో వికలాంగుల కోటా కింద రూ.3 వేలు (పింఛన్ ఐడీ 112802864) పింఛన్ పొందుతోంది. వెంకటగారిపల్లి గ్రామానికి చెందిన మల్లెల కమలమ్మ సైతం ఇదే విధంగా గత రెండేళ్లుగా (పింఛన్ ఐడీ 11200067583) పింఛన్ తీసుకుంటోంది. ఈ విషయం ఎమ్మెల్యే కేతిరెడ్డి, అధికారులకు తెలిసింది. వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకునేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నట్లు సమాచారం.

ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్ మారిస్తే కేసులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందించిన జగనన్న ట్యాబ్‌లలో సాఫ్ట్‌వేర్, బైజూస్ యాప్‌ను తొలగించొద్దు. వేరే సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. విద్యార్థులు ఏ మొబైల్ సెంటర్‌కు వచ్చినా ట్యాబ్‌లలో ఎలాంటి సాఫ్ట్‌వేర్ మార్చరాదన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం

బత్తలపల్లి: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొన్న నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని జెడ్పీటీసీ కోటి సుధ, తహసీల్దార్ యుగేశ్వరి దేవి అన్నారు. గురువారం టీచర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, బీసీ కాలనీల్లో పర్యటించారు. ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు.

అర్హులందరికీ ఓటుహక్కు కల్పిస్తాం

ధర్మవరం అర్బన్: నియోజకవర్గంలో అర్హత ఉన్న వారందరికి తప్పనిసరిగా ఓటుహక్కు కల్పిస్తామని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు ఫారం-6, ఫారం-7 భర్తీ చేసేటప్పుడు పారదర్శకంగా విధులు నిర్వర్తించేలా చర్యలు చేపడుతామని తెలిపారు. బీఎల్‌ఓలు ఎవ్వరూ కూడా ప్రజాప్రతినిధుల వద్ద వివిధ రాజకీయ పార్టీల ఇళ్లకు వెళ్లరాదని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరిదేవి, కమిషనర్ బండి శేషన్న పాల్గొన్నారు.

గాండ్లపెంట ఎస్‌ఐగా వెంకటనారాయణ

గాండ్లపెంట: గాండ్లపెంట ఎస్‌ఐగా ఏ.వెంకటనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. అమడగూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న ఈయన బదిలీపై గాండ్లపెంటకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ బి.మల్లికార్జునరెడ్డి ఓడీసీకి బదిలీపై వెళ్లారు. అనంతరం ఎస్‌ఐను వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు. సర్పంచ్ రహంతుల్లా, ఎంపీపీ తాతం జగన్మోహన్, కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల లక్ష్మీనరసింహగౌడ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బుక్కే రవీంద్రానాయక్ పాల్గొన్నారు.

13న శోభాయాత్ర

అమడగూరు: విశ్వ హిందూ పరిషత్, భజరంగ దళ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శౌర్య జాగరణ యాత్రను విజయవంతం చేయాలని ఆయా సంఘాలు పిలుపునిచ్చాయి. గురువారం రథయాత్ర ఓడీచెరువుకు చేరుకోవడంతో మండల భక్త మండలి నిర్వాహకులు స్వాగతం పలికారు. ఈనెల 13వ తేదీన పెనుకొండలో శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్య

కదిరి అర్బన్: మండల పరిధిలోని చవిటితండాకు చెందిన శంకర్‌నాయక్ (63) అప్పుల బాధ తాళలేక గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. రూరల్ మండల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శంకర్‌నాయక్ మృతదేహాన్ని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

తలుపుల: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గురువారం తహసీల్దార్ కే.శ్రీధర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్ చేతుల మీదుగా వికలాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. వివిధ గ్రామాలకు చెందిన 14 మంది వికలాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. కార్యక్రమంలో వికలాంగ సంక్షేమ అధికారిణి అంజినమ్మ, రాజేంద్ర, వికలాంగుల సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, అంజి, ఆర్డీటీ సీఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ నాయకుడు, పుట్టపర్తి మండలం సాతార్లపల్లి గ్రామ స్టోర్ డీలర్ ఉత్తన్న (52) తీవ్ర అనారోగ్యంతో గురువారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ ఏవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, మాజీ మండల కన్వీనర్ గంగాద్రి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఉత్తన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ

కదిరి టౌన్: పట్టణంలోని వికలాంగుల భవనంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వికలాంగులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఉపకరణాలను ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిమిజిలాన్, అన్నదాత రామిరెడ్డి పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

తనకల్లు: మండల పరిధిలోని తొట్లివారిపల్లి వద్ద చిన్ననారాయణ (60) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కదిరి రూరల్ మండలం కాళసముద్రానికి చెందిన చిన్నానారాయణ గ్రామంలోని తన చెల్లెలు ఇంటికి వచ్చాడు. గ్రామం సమీపంలో ఉన్న బావి దగ్గరకు వెళ్లిన ఆయన.. ప్రమాదవశాత్తూ కాలు జారడంతో బావిలోకి పడిపోయాడు. మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

పుట్టపర్తి అర్బన్: కోర్టు స్టాంప్ పెంపుపై పుట్టపర్తి బార్ అసోషియేషన్ సభ్యులు మండిపడ్డారు. ఈనెల 16వ తేదీ వరకూ విధులు బహిష్కరిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి రాకేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం ఏకపక్షంగా ఉందన్నారు. జిల్లా నుంచి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిథ్యం వహిస్తున్న రామిరెడ్డి వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు గంగిరెడ్డి, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, యదుభూషణ్, నాగేంద్ర, రాజగోపాల్ పాల్గొన్నారు.